క్లుప్తంగా

పరీక్ష సామగ్రి పంపిణీ



దంతాలపల్లి: మండలంలోని దొనకొండ, వేములపల్లి రామానుజపురం గ్రామాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయబోయే విద్యార్థులకు గురువారం మండల కాంగ్రెస్ యువజన నాయకుడు ఆవుల సురేష్ పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలు రాయబోయే విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా రాసి ఉతీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నకుమార్, సత్యనారాయణ, సోమయ్య, శశి, మనోజ్, ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ నిరసన దీక్ష

మహబూబాబాద్ రూరల్ : ఏఐసీసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ అనుబంధ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు మేకల వీరన్న యాదవ్ గురువారం తెలిపారు. జిల్లా ఎస్టీ, ఎస్సీ సెల్, జిల్లా ఐఎన్టీయూసీ, జిల్లా మైనారిటీ, జిల్లా ఎన్ఎస్ యూఐ, జిల్లా మహిళా కమిటీల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఉదయం 10 గంటలకు తహసీల్ వద్దకు చేరుకొని విజయవంతం చేయాలని కోరారు.

వృథాగా తాగునీరు



దోర్నకల్: మున్సిపాలిటి పరిధిలోని బైపాస్ రోడ్డులో రోడ్డు కింద పైపులు పగలడంతో తాగునీరు వృథాగా పోతోంది. బైపాస్ రోడ్డులో ఇటీవల బీటీ రెన్యువల్ పనుల్లో భాగంగా రోడ్డుపై బీటీ రోడ్డు పనులు చేపట్టారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్, తహసీల్ కార్యాలయం ఎదురుగా రెండు ప్రాంతాల్లో రోడ్డుకింద పైపులు పగలడంతో పైపుల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి పగిలిన పైపులకు వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుంత పూడ్చడం మరిచారు



మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్ కోసం విద్యుత్, మున్సిపల్ శాఖ అధికారులు గుంత తవ్వి లైటింగ్ కోసం పిల్లర్ పోసి గుంతను పూడ్చడం మరిచారు. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు ఆ గుంతను పూర్తిగా పూడ్చి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా బుంగ



గంగారం : మండలంలోని గంగారం–పుట్టల భూపతి గ్రామానికి వెళ్లే ప్రధానరహదారిలోని పందిపంపుల వాగు సమీపంలో పెద్ద బుంగ పడింది. దీంతో ప్రధాన రహదారిని ఆనుకొని పెద్ద ఎత్తున బుంగపడడంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆదమరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు వాహనదారులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బుంగ పూడ్చాలని కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

గార్ల: మండలకేంద్రంలోని మెయిన్ బజార్‌లో స్థానిక ప్రముఖుడు కట్టా రమేష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎండ తీవ్రత పెరిగినందున మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, సూత్రపు రాజుయాదవ్, నాగేశ్వరరావు, వెంకన్న, వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల ఊరేగింపు



గార్ల : స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో, పుట్టకోట రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించిన అనంతరం గురువారం రాత్రి సీతారాముల విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, లక్ష్మీనర్సు, నర్సయ్య, రాంభద్రయ్య, ఉపేందర్, కోటేష్, పాల్గొన్నారు.

చిన్నగూడూరు : ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్యా



నర్సింహులపేట : కల్యాణం జరుపుతున్న పూజారులు



కొత్తగూడలో..



కేసముద్రం: విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు



వైభవంగా సీతారాముల కల్యాణం

శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు మానుకోట పట్టణంలోని వాడవాడలా, అలాగే మండలంలోని గ్రామాలు, తండాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. కేసముద్రం, గూడూరు, చిన్నగూడూరు, మరిపెడ, కొత్తగూడ, కురవి, నర్సింహులపేట, దోర్నకల్, నెల్లికుదురు,బయ్యారం,గార్ల, దంతాలపల్లి, తొర్రూరు, గంగారం మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాల్లో రాములోరి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాల ప్రతినిధులు భక్తులకు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మండపాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అర్చకులు కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాన్ని స్వీకరించారు. అన్ని చోట్ల దాతలు మహాన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



గూడూరు : పుస్తెలతాడు చూపిస్తున్న పూజారి రాజు



మరిపెడ : వివాహాన్ని తిలకిస్తున్న భక్తులు



కురవి : కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు



గంగారం: మడగూడెంలో శ్రీరాముడు, సీతాదేవిల విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు



మరిపెడ రూరల్ : కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



మహబూబాబాద్ రూరల్ : శనిగపురంలో..



తొర్రూరు : కల్యాణ వేడుకల్లో భక్తులు



దోర్నకల్‌లో..



బయ్యారం : కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నెల్లికుదురు : మదనతుర్తిలో పాల్గొన్న మాజీ ఐపీఎస్‌లు



దంతాలపల్లి : దాట్లలో సీతమ్మకు తాళి కడుతూ..



గార్ల : పీటలపై కూర్చున్న సర్పంచ్ బన్సీలాల్ దంపతులు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాలు అందజేసి ఆమోదం తెలిపి ఉత్తర్వులు జారీ చేయగా ఆ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు మాలోతు భిక్షపతి నాయక్ మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న 1900 మంది ఉపాధ్యాయుల సర్వీసులను ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరణ చేస్తూ వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మాలోత్ సోమేశ్వర్, జిల్లా అధ్యక్షుడు ధరావత్ బాలాజీ, కోశాధికారి



సీఎం కేసీఆర్, మంత్రి సత్యవతి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీను, శంకర్, సంపత్, శ్రీరాములు, పడిగా విజయ్ కుమార్, శ్రీనివాస్, హనుమంతు, కిషన్, భరత్, రవి, భారతమ్మ, పుష్పలీల, హైమా, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో భోగ్ భండారో పూజలు



వినాయకతండాలో పూజలు నిర్వహిస్తున్న శంకర్

మహబూబాబాద్ రూరల్: భగవంతుడా అందరినీ చల్లగా చూడు (భగవాన్ సేనే అచ్చోరకో) అంటూ లంబాడ గిరిజనులు గురువారం తండాల్లో శ్రీరామనవమి సందర్భంగా భోగ్‌భండారో పూజలు నిర్వహించారు. తండాల్లోని బాలాజీ స్వామి, ఆంజనేయ స్వామి, హథీరాం బావాజీ దేవాలయాల ఎదుట గిరిజన సంప్రదాయం ప్రకారం బియ్యం పిండి, బెల్లం, నెయ్యితో తయారుచేసిన ప్రత్యేక నైవేద్యాన్ని భోగ్‌భండారోగా సమర్పించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో వార్డు కౌన్సిలర్ తాళ్లపల్లి జగన్, తండా పెద్దమనిషి బానోతు శంకర్‌మేస్త్రి, రత్నావత్ రమేష్, హంక్య, సక్రాం, తదితరులు పాల్గొన్నారు. గుండాలగడ్డతండ జీపీ పరిధిలోని కస్నతండలో నిర్వహించిన పూజల్లో జెడ్పీటీసీ లూనావత్ ప్రియాంక, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్, సర్పంచ్, ఉప సర్పంచ్, భక్తులు పాల్గొన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని గుండాలగడ్డతండలో సేవాలాల్‌సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న, మో తీలాల్, బన్సిలాల్, లాలు, భద్రు, శంకర్, సంజీవ, శ్రీకాంత్, శ్రీను, వినోద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 'బలగం' సినీనటుల సందడి

నెల్లికుదురు: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని మండలలోని వివిధ గ్రామాల్లో గురువారం నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి బలగం సినీనటులు సందడి చేశారు. మండలంలోని మదనతుర్తిలో శ్రీ వివేకానంద సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బలగం సినీ నటులు ముగ్గురుని ఘనంగా సన్మానించారు. మునిగలవీడులో సర్పంచ్ నల్లాని నవీన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బలగం సినిమాను ప్రజలు చూసేందుకు స్క్రీన్ మీద ప్రదర్శించారు. కార్యక్రమానికి బలగం సినీ నటులు సాయన్న, వేముల ప్రభాకర్, దుగ్గి రాజు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, తదితరులు పాల్గొన్నారు.



సినీనటులను సన్మానిస్తున్న సమితి బాధ్యులు

కాయలకు రక్షణగా ఫ్రూట్‌టెక్ కవర్లు



గార్ల : మామిడి కాయలకు ఫ్రూట్‌టెక్ కవర్లు రక్షణ కవచంగా మారడంతో పాటు, కోతుల బెడద నుంచి మామిడి కాయలను కాపాడుకోవచ్చని రైతు పులిచింతల ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఉపేందర్ రెడ్డి ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ తన 20 ఎకరాల మామిడి తోటలోని కాయలకు ఫ్రూట్‌టెక్ కవర్లను కట్టించానని తెలిపారు. కవర్లు కట్టడం వలన 40 రోజుల్లోనే కాయ సైజ్‌తో పాటు కలర్ వస్తుందని పేర్కొన్నారు. మండలంలో తొలిసారి మామిడితోటకు ఈ రైతు చేసిన వినూత్న ప్రయోగాన్ని అటుగా రోడ్డుపై వెళ్లే బాటసారులు ఆగి చూసి రైతు ఐడియాను అభినందిస్తున్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



దంతాలపల్లి: మండలం బీఆర్ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మానుకోట జిల్లా కోఆప్షన్ సభ్యుడు రహమాన్ పాషా అన్నారు. గురువారం మండలంలోని బొడ్లాడలో జెడ్పీ కోఆప్షన్ నిధుల నుంచి మంజూరైన సెంట్రల్ లైటింగ్‌ను సర్పంచ్ మండ సుష్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలను పూర్తిగా అభివృద్ధి పథంలో నడిపించటమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఎస్సై జగదీష్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



తొర్రూరు రూరల్: నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అండగా ఉంటామని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ రేగూరి వెంకన్న, లయన్స్ టీచర్స్ అధ్యక్షుడు రాయిపెల్లి యాకయ్య అన్నారు. గురువారం మండలంలోని అరిపిరాల జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కుమ్మరి రాజు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పెయింటింగ్ పోటీలో ప్రతిభను చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అనంతరం లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాజును, చదివిస్తున్న మేనమామ, అత్తమ్మలను సన్మానించి, ఆర్థిక సాయం అందించారు.

బీజేపీతోనే ప్రజాసమస్యల పరిష్కారం

తొర్రూరు: బీజేపీతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పెదగాని సోమయ్య అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలో బీజేపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యాలయాలు ప్రజాసమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉపయోగపడతాయన్నారు. శుక్రవారం మహబూబాబాద్‌లో బీజేపీ జిల్లా నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నామని, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, నాయకులు బొచ్చు సురేష్, భూక్య బిక్షం, పైండ్ల రాజేష్, రాజ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెదగాని సోమయ్య

వ్యాపారుల ఇబ్బందులు పట్టించుకోరా !



మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

దోర్నకల్ : మార్కెట్ భవనం లేక కూరగాయల వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పట్టించుకోరా అంటూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రాంచంద్రునాయక్ ప్రశ్నించారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో గురువారం పర్యటించిన ఆయన పర్యటించి వ్యాపారులతో మాట్లాడారు. కూరగాయల మార్కెట్‌లో దుకాణాలను కూల్చి నూతన భవనం నిర్మించకపోవడంతో నాలుగేళ్లుగా వ్యాపారులు ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాపారుల ఇబ్బందులను ఎమ్మెల్యే, ఎంపీ, మున్సిపాలిటీ పాలకవర్గం గాలికి వదిలేశారని తెలిపారు. మున్సిపాలిటీకి కేటాయించిన ప్రత్యేక నిధులతో చేపట్టిన పనులు పాలకవర్గ నిర్లక్ష్యంతో నేటికీ పూర్తి కాలేదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు కరుణాకర్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, పగడాల వెంకన్న, భాస్కర్, డీజే శ్రీను పాల్గొన్నారు.

వాడవాడనా సీసీ రోడ్ల నిర్మాణం

తొర్రూరు రూరల్: గిరిజన తండాల్లోని వాడవాడనా సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని పెద్ద దుబ్బతండలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రతి గ్రామంలో రూ.1 కోటి, గిరిజన తండాల్లో సైతం రూ.50 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి గ్రామాలు, గిరిజన తండాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ జాటోతు విజయ్‌కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు అంకూస్, నాయకులు పులి వెంకన్న, జాటోతు సురేష్, జాటోతు శ్రీను, వెంకన్న, దేవేందర్, సైదులు, శోభన్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్

వేసవిలో అలుగుపోస్తున్న పెద్దచెరువు



మరిపెడ రూరల్ : ఒక పక్క వేసవి మండుటెండలు కొడుతూ భూ గర్భజలాలన్నీ అడుగంటిపోతున్న తరుణంలో ఓ చెరువు అలుగు పోస్తూ జలపాతంలా కనువిందు చేస్తుంది. ఆ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు, పాదచారులు అలుగుపోస్తున్న ప్రాంతాన్ని చూసి వేసవిలో సేద తీర్చుకుంటున్నారు. మండలంలోని బాహోజిగూడెం శివారు పెద్ద సముద్రంలోకి యాసంగి పొలాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ అధికారులు ఎస్సారెస్పీ జలాలు వదిలారు. దీంతో పెద్దసముద్రం చెరువు నిండుకుండలా నిండుకుని మత్తడి పోస్తుంది. జలాల రాకతో కుంట కింద యాసంగి పైర్లు పచ్చాని రంగేసినట్లుగా మారాయి.